


# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 305 | జూలై 3 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# అనుమతులు ఎక్కడ..? అడ్మిషన్లు ఎలా..?

## ఫిజిక్స్ వాలా విద్యాపిట్‌పై ప్రశ్నల వర్షం







నీట్ - జేఈఈ పేరుతో భారీ ఫీజులు...

అనుమతులపై సందేహాలు...

అధికారుల మౌనం ఎందుకు..?

తల్లిదండ్రుల ఆందోళన
విద్యార్థుల భవిష్యత్‌కు ముప్పా..?

**మన దునియా,హనుమకొండ:జులై 02**

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామంటూ ప్రచారం చేస్తున్న ఫిజిక్స్ వాలా విద్యాపిట్ (లెర్నింగ్ సెంటర్/జూనియర్ కళాశాల) కార్యకలాపాలపై హనుమకొండలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖల నుంచి అన్ని అవసరమైన అనుమతులు పొందకుండానే అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**పదో తరగతి విద్యార్థులే లక్ష్యమా..?**

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రైవేట్

## మహారాష్ట్ర రాజకీయంలో పెను సంచలనం: కాంగ్రెస్‌లో విలీనం కానున్న శరద్ పవార్ పార్టీ.

. తెరవెనుక చకచకా కదులుతున్న పావులు!

కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్) విలీన చర్చలు

మహారాష్ట్ర రాష్ట్రస్థాయి నేతల మధ్య అంతర్గత సమాలోచనలు

ఢిల్లీ వేదికగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం

మహా వికాస్ అఘాడీ కూటమిలో పెరుగుతున్న విభేదాలు

1999 నాటి చారిత్రక చీలికకు ముగింపు పలికే దిశగా అడుగులు

మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసే ఒక సంచలన పరిణామం (మిగతా 2వ పేజీలో..)



## భారత్‌-పాక్ మధ్య చర్చలు జరపండి.. ఇరు దేశాల ప్రధానులకు 117 మంది ప్రముఖుల లేఖ

భారత్-పాకిస్థాన్ మధ్య చర్చలు ప్రారంభించాలని ప్రముఖుల ఉమ్మడి లేఖ

ఇరు దేశాల ప్రధానులు మోదీ, షెహబాజ్‌కు 117 మంది ప్రముఖుల విజ్ఞప్తి

ఉగ్రవాదం వంటి అంశాలపైనా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని సూచన



(మిగతా 2వ పేజీలో..)

## సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్

చర్చకు సవాల్ చేసిన కాంగ్రెస్ నేతలే వెనక్కి తగ్గారని కేటీఆర్ విమర్శ

హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

అప్పులు, గురుకులాల అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్

తన లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న మంత్రి జూపల్లి

రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. (మిగతా 2వ పేజీలో..)



## తమిళనాడులో గోవధపై హైకోర్టు నిషేధాన్ని సుప్రీంలో సవాల్ చేసిన విజయ్ ప్రభుత్వం

హైకోర్టు తీర్పు 1958 జంతు సంరక్షణ చట్టానికి విరుద్ధంగా ఉందని ప్రభుత్వ వాదన

ఈ తీర్పు మతస్వేచ్ఛను హరిస్తోందని ప్రతిపక్షాలు, ముస్లిం సంఘాల ఆందోళన

బక్రీద్, హిందూ పండుగల్లో జంతుబలులపై ప్రభావం చూపుతున్న తీర్పు

సుప్రీంను ఆశ్రయించడంలో జాప్యంపై టీవీకే ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు

తమిళనాడులో గోవధపై మద్రాస్ హైకోర్టు విధించిన సంపూర్ణ నిషేధాన్ని సవాల్ చేస్తూ, నటుడు (మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం


## సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)




కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు. గన్‌పార్క్‌కు వెళుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు. నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.

## భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి.. ఇరు

## దేశాల ప్రధానులకు 117 మంది ప్రముఖుల లేఖ

**శాంతి, స్థిరత్వంతోనే ఆర్థిక శ్రేయస్సు సాధ్యమని వెల్లడి**

ప్రస్తుత ఉద్రిక్తతలు సాధారణ ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళనభారతదేశం, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి, ఇరు దేశాల మధ్య చర్చల ప్రక్రియను పునఃప్రారంభించాలని కోరుతూ 117 మంది ప్రముఖులు ముందుకు వచ్చారు. భారత్, పాక్‌లకు చెందిన ఈ ప్రముఖులు ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లకు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. దౌత్య మార్గాలను తిరిగి తెరిచి, సంప్రదింపులకు శ్రీకారం చుట్టాలని వారు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్' అధినేత ఓపీ షా ఈ విషయంపై మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవని, ఈ పరిస్థితి ఉపఖండంలోని సాధారణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య శాంతి, స్థిరత్వం, సాధారణ సంబంధాలు నెలకొంటేనే ప్రజల ఆర్థిక శ్రేయస్సు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాలను సంఘర్షణ వైపు నడిపించే ఏ చిన్న సంఘటన అయినా ప్రజల జీవనోపాధిని, అభివృద్ధిని దెబ్బతీస్తుందని ఆయన వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడుల (26/11 ముంబై, పుల్వామా, పహల్గామ్) గురించి ప్రశ్నించగా.. చర్చలు, సంప్రదింపులపై తనకు పూర్తి విశ్వాసం ఉందని షా బదులిచ్చారు. ఉగ్రవాదం, భద్రతాపరమైన ఆందోళనలతో సహా అన్ని క్లిష్టమైన సమస్యలను దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. చర్చలు నిరంతరాయంగా కొనసాగాలని, ఏ దశలోనూ ఇరు దేశాల మధ్య సంభాషణలు ఆగకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాదంపై భారత్ కఠినంగా వ్యవహరిస్తున్న తీరుపై స్పందిస్తూ.. ఎంతటి కఠినమైన సమస్యలైనా చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని షా పునరుద్ఘాటించారు. భారత్, పాకిస్థాన్‌లలోని లక్షలాది మంది ప్రజలు శాంతినే కోరుకుంటున్నారని, తమ శాంతి పిలుపునకు మద్దతుగా వేలాది మంది సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. నిరంతర చర్చల వల్ల ఒకరి ఆందోళనలు, పరిమితులు మరొకరు అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

# అనుమతులు ఎక్కడ..? అడ్మిషన్లు ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల వద్ద ప్రచారం, కలపత్రాలు పంపిణీ, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేపడుతున్నారని చెబుతున్నారు. "పరిమిత సీట్లు", "త్వరగా నమోదు చేసుకోండి" వంటి ప్రచారంతో తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి.

పిఆర్‌ఓలతో అడ్మిషన్ల వేట..?

అడ్మిషన్ల కోసం ప్రత్యేకంగా పిఆర్‌ఓలను నియమించి, వారు తీసుకొచ్చే ప్రతి విద్యార్థిపై కమిషన్ చెల్లిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ఈ విధానం అమలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులు లేకుంటే అడ్మిషన్లు ఎలా..?

జూనియర్ కళాశాల నిర్వహించాలంటే సంబంధిత నిబంధనల ప్రకారం అనుమతులు, గుర్తింపులు తప్పనిసరి. అయితే ఫిజిక్స్ వాలా విద్యాపిట్‌కు అన్ని అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత రాలేదు. ఇదే సమయంలో అడ్మిషన్లు చేపట్టడం చట్టబద్ధమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..?

అనుమతుల అంశంలో స్పష్టత లేకుండా అడ్మిషన్లు జరిగితే, భవిష్యత్తులో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అందుకే అడ్మిషన్ తీసుకునే ముందు తల్లిదండ్రులు అన్ని అధికారిక అనుమతులను పరిశీలించాలని సూచిస్తున్నారు.

డీఈఓ -- డీఐఈఓ చర్యలు ఎప్పుడు..?

జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై తనిఖీలు నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఫలితాలేమిటి? ఐఐటి జేఈఈ నీట్ ఇనిస్ట్యూట్ పెట్టుకోవడానికి డి ఈ ఓ అనుమతులు తీసుకున్నారా ..? లేకుండా అడ్మిషన్లు జరుగుతున్నాయనే ఆరోపణల్లో వాస్తవం ఉంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# తమిళనాడులో గోవధపై హైకోర్టు నిషేధాన్ని సుప్రీంలో సవాల్ చేసిన విజయ్ ప్రభుత్వం

విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పు రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టాలకు విరుద్ధంగా ఉందని, మతపరమైన ఆచారాలకు ఆటంకం కలిగిస్తోందని ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారం ప్రస్తుతం తమిళనాట రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ వాదనలు ఇవే..

మే 27న మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు.. 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం-1958' నిబంధనలకు విరుద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఈ చట్టం ప్రకారం పదేళ్లు దాటిన, వ్యవసాయ పనులకు లేదా సంతానోత్పత్తికి పనికిరావని పశువైద్య అధికారి ధ్రువీకరించిన ఆవులను వధించేందుకు అనుమతి ఉంది. అయితే, హైకోర్టు తీర్పు ఈ చట్టాన్ని పట్టించుకోకుండా, రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ నిషేధం విధించిందని ప్రభుత్వం తన అప్పీల్‌లో పేర్కొంది. వాస్తవానికి, కోయంబత్తూరులో బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో జంతువధను నిరోధించాలని మాత్రమే కోర్టులో పిటిషన్ దాఖలైందని, కానీ హైకోర్టు తన పరిధిని దాటి రాష్ట్రవ్యాప్త నిషేధానికి ఆదేశాలు జారీ చేసిందని ప్రభుత్వం వివరించింది.

మత స్వేచ్ఛకు భంగం..

బక్రీద్ లేదా మరే ఇతర రోజుల్లోనూ ఆవులు, దూడలను వధించకుండా చూడాలని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేవలం బక్రీద్ పండుగకే కాకుండా రాష్ట్రంలోని హిందూ దేవాలయాల్లో జరిగే జంతుబలులపై కూడా ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. పండుగల సమయంలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా లైసెన్స్ ఉన్న స్లాటర్‌హౌస్‌లలో వసతి కల్పించడం అసాధ్యమని, చాలా వాటికి అంత సామర్థ్యం లేదని పలువురు సామాజిక నాయకులు అంటున్నారు. ఎంఎంకే అధ్యక్షుడు ఎం.హెచ్. జవహిరుల్లా ఈ తీర్పును బాధాకరం అని అభివర్ణిస్తూ, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు హామీ ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడమేనని అన్నారు.

ప్రతిపక్షాల విమర్శలు

ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడంలో టీవీకే ప్రభుత్వం జాప్యం చేసిందని ప్రతిపక్ష డీఎంకే విమర్శించింది. డీఎంకే ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హఫీజుల్లా మాట్లాడుతూ.. "పాలిచ్చే ఆవులను ఆర్థిక కారణాల వల్ల ఎవరూ వధించరు. ఈ తీర్పు కేవలం ఆవులకే కాకుండా ఎద్దులు, గేదెల వధను కూడా నిషేధిస్తోంది. ఇది ముస్లింలకే కాదు, ఆలయాల్లో బలులు ఇచ్చే హిందువుల ఆచారాలపైనా ప్రభావం చూపుతుంది" అని అన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న జాప్యంపై స్పందించిన టీవీకే వర్గాలు.. "న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకు కొంత సమయం పట్టింది" అని వివరణ ఇచ్చాయి. ప్రస్తుతం ఉన్న చట్టాలు జంతువధకు సంబంధించి స్పష్టమైన నిబంధనలను నిర్దేశిస్తున్నాయని, హైకోర్టు తీర్పు 'జ్యుడీషియల్ లెజిస్లేషన్' (న్యాయవ్యవస్థ చట్టాలను రూపొందించడం) కిందకు వస్తుందని ప్రభుత్వం సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించింది.

# మహారాష్ట్ర రాజకీయంలో పెను సంచలనం: కాంగ్రెస్‌లో విలీనం కానున్న శరద్ పవార్ పార్టీ.

తెరపైకి వచ్చింది. సీనియర్ నేత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ - శరద్ పవార్ శ్రేణి) పార్టీని, కాంగ్రెస్‌లో విలీనం చేసే దిశగా ఇరు పార్టీల మహారాష్ట్ర రాష్ట్రస్థాయి విభాగాల మధ్య అత్యంత రహస్యంగా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఒకవేళ ఈ విలీనం గనుక సఫలమైతే, మహారాష్ట్ర ప్రతిపక్ష రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఈ విలీన ప్రతిపాదనలపై రాష్ట్రస్థాయిలోనే ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి. ఎన్సీపీ (ఎస్పీ) తమ పార్టీ అంతర్గతంగా నేతలందరి మధ్య ఒక ఏకాభిప్రాయాన్నిసాధించిన తర్వాత, ఈ అంశాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకోనున్నారు. నిజానికి, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ విలీన ఆలోచన వచ్చినప్పటికీ.. ఎన్నికల ప్రచారం, వ్యూహాల బిజీ వల్ల దీనిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది.

కూటమిలో కుదుపు.. 27 ఏళ్ల చరిత్రకు ముగింపు?

ఈ విలీన వార్తలు 'మహా వికాస్ అఘాడీ' (ఎంవీఏ - కాంగ్రెస్, ఎన్సీపీ శరద్ పవార్, శివసేన ఉద్ధవ్ థాకరే) కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల ఉద్ధవ్ థాకరే వర్గంలో జరిగిన తిరుగుబాట్లు, అలాగే కూటమి ఐక్యతపై స్వయంగా ఉద్ధవ్ థాకరే బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేయడంతో ఎంవీఏ భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే తీవ్రమైన భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్, ఎన్సీపీ విలీన ప్రయత్నాలు కూటమి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 1999లో సోనియా గాంధీ విదేశీ మూలాల వివాదం నేపథ్యంలో.. శరద్ పవార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని స్థాపించారు. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత మళ్లీ అదే కాంగ్రెస్ గూటికి శరద్ పవార్ చేరబోతుండటం గమనార్హం. 2023లో ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ సొంతంగా చీలిక తెచ్చి అధికార పక్షంతో చేతులు కలపడం వల్ల ఎన్సీపీ మరింత బలహీనపడింది. ఇటీవల అజిత్ పవార్ గ్రూపుతో విలీనాన్ని పూర్తిగా తోసిపుచ్చిన శరద్ పవార్.. ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమవ్వడం మహారాష్ట్ర పాలిటిక్స్‌లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత..

### హరీశ్ రావును అడ్డుకున్నా పోలీసులు

**మన దునియా,హైదరాబాద్:జులై 02**

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరాయి. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో గురుకుల విద్యాసంస్థల్లో అవి నీతి ఆరోపణలపై ఇరు పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగు తున్నాయిఈ నేప థ్యంలో గన్‌పార్క్ కేంద్రంగా రాజకీయ వేడి మరింత పెరిగింది. కాంగ్రెస్ తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ క్రికెటర్ మ హ్మద్ అజహరుద్దీన్ గన్‌పార్క్‌కు చేరుకుని చర్చకు సిద్ధమయ్యారు.మరో వైపు బీఆర్ఎస్ నేతలు కూడా అన్ని ఆధారాలతో వస్తా మని ప్రకటించడం తో ఉద్రిక్త పరిస్థితు లు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీ య ఘటనలు జరగ కుండా గన్‌పార్క్, ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు,మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఇతర అంశాలపై అన్ని ఆధారాలతో గన్‌పార్క్‌కు వస్తున్నాం. కాంగ్రెస్ మంత్రులు అక్కడే ఉండాలి' అని సవాల్ విసిరారు. ప్రజల ముందే వాస్త వాలను వెల్లడిస్తా మని ఆయన స్పష్టం చేశారు.అయితే తెలంగాణ భవన్ నుంచి గన్‌పా ర్క్‌కు బయల్దేరిన హరీశ్‌రావును పోలీ సులు అడ్డుకోవడం తో ఉద్రిక్తత నెల కొంది. పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో కొద్దిసేపు తెలంగాణ భవన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపు లోకి తీసుకురావ డానికి పోలీసులు అదనపు బలగాల ను మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తెలంగాణ భవన్‌కు చేరుకుని పార్టీ నేతలతో



సమావేశమయ్యారుకాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా అప్పుల అం శంపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానని ప్రకటించ డం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది.గన్‌పార్క్‌లో అమర వీరుల స్తూపం వద్ద చర్చ నిర్వహించాల ని బీఆర్ఎస్ నేతలు పట్టుబడుతుండగా.కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయి లో ఎదురుదాడికి సిద్ధమయ్యారు. దీంతో రాష్ట్ర రాజకీ యాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇరు పార్టీల నేతల వ్యాఖ్యలు, సవాళ్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం గన్‌పార్క్, తెలంగాణ భవన్, ప్రెస్‌క్లబ్ పరిసరాల్లో భారీ పోలీసు బందో బస్తు కొనసాగుతోంది.

# కన్నాయిగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా జాడి రాంబాబు

**మన దునియా, వాజేడు ,జూలై 2**



02- 07 -2026 గురువారం రోజున ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామక ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నా నియమాకం కోసం అండగా నిలిచిన ప్రజలకి ఎల్లప్పుడూ ఉత్సాహం ఉంటూ సేవలు అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధన్సరి అనసూయ (సీతక్క) కు నియామకం కృషి చేసిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యా ణి కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇరుస వడ్ల వెంకన్న జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్ నా అధ్యక్ష పదవికి సహకరించిన ప్రస్తుతం కొనసాగుతున్న మండల అధ్యక్షులు ఎండి అప్సర పాషా అలాగే నా నియమాకానికి కృషి చేసిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ



సంఘాల జిల్లా అధ్యక్షులకు మండల యూత్ కాంగ్రెస్ నాయకులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు అధ్యక్షులకు నాయకులకు యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులకు నాయకులకు కన్నాయిగూడెం మండల సీనియర్ నాయకులకు ప్రజాప్రతినిధులకు సర్పంచ్ ఉప సర్పంచ్లకు సోషల్ మీడియా వారియర్స్ కు గ్రామ పార్టీ కార్యకర్తలకు మహిళా నాయకురాలకు నాపై ప్రేమ అభిమానాలు చూసిన ప్రతి కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అలాగే మీరు నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నిత్యం ప్రజల్లో ఉంటూ అధిష్టాన మాట ప్రకారం కట్టుబడి పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసి ప్రజా సంక్షేమానికి కన్నాయిగూడెం మండల అభివృద్ధికి అంకితభావంతో పనిచేసేసి పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు

# జెసిపి తో మట్టి పోసి నీటి గుంటలను పుడుస్తున్న సర్పంచ్ భరత్ కుమార్







### ప్రజాసేవలో పట్టు వదలని సర్పంచ్ భరత్ కుమార్

**మన దునియా ,వాజేడు ,జూలై 2**

ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడి గ్రామపంచాయతీ లోని ఎంపియుపిఎస్ స్కూల్ ముందు వర్షపు నీటితో నీళ్లు నిలవడంతో జెసిబి తో మట్టిని పోసి నీటి గుంతలను కూడిపిస్తున్న సర్పంచ్ అట్లాగే స్కూలు ఆవరణంలోని టాయిలెట్ చుట్టూ ఉన్న మట్టిని సమానంగా చేసి నీరు నిలవకుండా నీటి గుంటలను శుభ్రంగా దోమలు నీటి మీద నిలవకుండా ఉండేటట్టు చదును సేపిస్తున్నారు వర్షాలు అధికంగా కురవడం వలన నీటి గుంటలలో నీళ్లు ఉండటం వల్ల దోమలు పిల్లలను తయారు చేస్తాయ ని ముందుగానే గమనించిన సర్పంచ్ ఎక్కడ నీటి గుంటలో ఉన్న మట్టితో నింపి నీళ్లు నిలవకుండా జెసిపి సాయంతో నీటుగా చేస్తున్నారు

# కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు శుభవార్త!

**మన దునియా,హైదరాబాద్:జులై 02**



రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కు భారీ ఉపశమనం కలిగింది.జూలై 01 వ తేదీనే వారి అకౌంట్ల లోజీతాలు జమ చేసినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. గతంలో జీతాలు ఆలస్యంగా రావడం తో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుం ది.కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే నిర్ణీత తేదీన జీతాలు పొందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్ష లో అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఆర్థిక శాఖ అన్ని శాఖలకు స్పష్టమైన మార్గద ర్శకాలను జారీ చేసింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం.. ప్రతి నెల 25వ తేదీలోగా సంబంధిత శాఖలు జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగా లకు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే నెల చివరి పని దినానికల్లా బిల్లుల పరిశీలన.. ఆడిట్ ప్రక్రియ పూర్తి చేసి.. తదుపరి నెల మొదటి తేదీన ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమయ్యే లా చర్యలు తీసుకో వాలని రాష్ట్ర ప్రభు త్వం సూచించింది.ఈ నెల బిల్లులు సకాలంలో అందిన అన్ని శాఖల ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ చేసినట్లు ఆర్థిక శాఖ అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి నివే దిక సమర్పించారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసు కున్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీతాల కోసం ప్రతి నెల ఎదురుచూడాల్సిన పరిస్థితి ఇక నుంచి ఉండదని.. కుటుంబ ఆర్థిక ప్రణాళికలు కూడా సులభతరం అవుతాయని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కవిత అరెస్టు!

**మన దునియా,హైదరాబాద్:జులై 02**



తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవితను పోలీసులు గురువారం ఉదయం అరెస్ట్ చేశారు. ఆమెను కాళ్లు చేతులు పట్టు కుని ఈడ్చుకుంటూ తీసుకెళ్లడంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీ ప్రకారం250 చదరపు గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేస్తూ.. బోడుప్పల్లో చేపట్టిన భూ పోరా టం కార్యక్రమం నిర్వహిస్తుండగా. ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు. ఆమెతో పాటు మరికొందరు టిఆర్ఎస్ నాయకులను కూడా అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాంగ్రెస్ సర్కార్ పై కవిత నిప్పులు చెరిగారు తెలంగాణ ఉద్యమకారుల కోసం పోరాడుతున్న టిఆర్ఎస్ నాయకు లను అరెస్ట్ చేయడంపై కవిత తీవ్రంగా స్పందించా రు.అరెస్ట్ తర్వాత బొల్లారం పోలీస్ స్టేషన్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలు, ఉద్యమ కారులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం దారుణమని... ప్రభుత్వ ఆదేశాల తోనే ఇదంతా జరి గిందని అన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని... విచక్షణారహితంగా లాఠీలతో కొడుతూ రక్తం కళ్లజూశారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాలుగో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్ష

**మన దునియా, జులై 02,మంచిర్యాల జిల్లా**

మందమర్రి ఏరియా సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరింది. దీక్షలో ఎక్కువ సంఖ్యలో అధికారులు పాల్గొన్నారు, వీరితో పాటు మహిళా అధికారులు కూడా దీక్షలు పాల్గొన్నారు. జీతంలో భాగమైన పిఆర్పి చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతున్న దృష్ట్యా, పే అప్గ్రేడేషన్, ఫ్రీ ఎలక్ట్రిసిటీ బిల్, ఫీ రియాంబర్స్మెంట్, కంపెనీకి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని గత కొద్ది రోజులుగా సింగరేణిలోని 2500 మంది అధికారులు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే. కంపెనీ అభివృద్ధికి సమయాభావం లేకుండా కృషి చేసే అధికారులకు ఇలాంటి పరిస్థితి రావడం శోచనీయం అని భావిస్తున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి న్యాయమైన డిమాండ్లు తీర్చాలని మందమర్రి ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్ రమేష్ తెలియజేశారు .గురువారం దీక్ష శిబిరంలో అధికారుల సంఘం వైస్. ప్రెసిడెంట్ నాగ వర్ధన్, జాయింట్ సెక్రెటరీ ఆర్. నరేష్ సిహెచ్. రమేష్, సిన్హా ,కార్తీక్, కే.సత్య గౌడ్, ఎం. రామకృష్ణ, కే. కిరణ్ కుమార్, కె. భార్గవ్, మహిళా అధికారులు డాక్టర్. శ్రీజ ,డాక్టర్ గౌతమి ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు . అధికారులు చేస్తున్న ఈ కార్యక్రమానికి సీనియర్ అధికారుల సతీమణులు సఫియా ఖాదర్ , సునీత సంతోష్ , మాధవి మురళి ఈ కార్యక్రమానికి విచ్చేసి వారి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందమరి ఏరియా సీనియర్,జూనియర్ అధికారులు పాల్గొన్నారు.



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## హుజూరాబాద్ ప్రజలపై ఇసుక భారం

**స్థానిక ఇసుకపై ముందుగా స్థానికులకే హక్కు ఉండాలి**

**నేడు సామాన్యుడు ఇల్లు కట్టాలంటే నెత్తి నోరు కొట్టుకునే దుస్థితి**

**ప్రభుత్వంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు**

మన దునియా హుజూరాబాద్ నియోజకవర్గం



హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు అందాల్సిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ భారీగా ఆదాయం ఆర్జిస్తున్న ప్రభుత్వం, అదే ఇసుకను స్థానిక ప్రజలు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రైవేట్ నిర్మాణాలు ఇసుక కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో రూ.1,500 నుంచి రూ.2,000 వరకు లభించిన ట్రాక్టర్ ఇసుక ప్రస్తుతం రూ.8,000 నుంచి రూ.10,000 వరకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో లభించే ఇసుకను ముందుగా స్థానిక ప్రజల అవసరాలకే కేటాయించాలని, స్థానిక అవసరాల కోసం ఇసుక రవాణాపై ఆంక్షలు సడలించాలని డిమాండ్ చేశారు. అక్రమ రవాణాపై మాత్రం ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇసుక విధానాన్ని పునఃసమీక్షించి, స్థానిక ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు.

## మూడో విడత రైతు భరోసా నిధులు విడుదల

మన దునియా,హైదరాబాద్:జులై 02





హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు మరోసారి శుభవార్త చెప్పింది. రైతు భరోసా పథకం కింద మూడో విడత నిధులను విడుదల చేసింది. 3 నుంచి 4 ఎకరాల భూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ.1,330 కోట్లను జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 6.39 లక్షల మంది రైతులు లబ్ధి పొందగా, ఇప్పటివరకు మొత్తం 61.35 లక్షల మంది రైతులకు రూ.5,402.37 కోట్ల రైతు భరోసా సాయాన్ని ప్రభుత్వం అందించినట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, సాగు ఖర్చులను తగ్గించడం, రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే రైతు భరోసా పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని మంత్రి తుమ్మల అన్నారు.

# నిద్రలో ఉన్న భర్త చెవిలో విషం పోసిన భార్య..!

మన దునియా,తమిళనాడు:జులై 02

తమిళనాడు: భర్తను చనిపోతే రుణదాతల ఒత్తిళ్ల నుంచి బైటపడవచ్చని భావించిన ఓ మహిళ కట్టుకున్న వాడినే లేపేసేందుకు స్కెచ్ వేసింది. అతడి చెవిలో విషం పోసింది. వివరాలు.. తంజావూరు జిల్లా, తిరువిడైమరుదూర్ తాలూకాలోని పుళుదికుడికి చెందిన కూలీ రవిచంద్రన్ (54), ఉమారాణి (48)ని 27 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కుమారుడు విదేశాలలో పని చేస్తుండగా, కుమార్తెకు పెళ్లైంది. రవిచంద్రన్ కొత్తగా ఇంటి నిర్మాణం కోసం మీద పాలారి-ద్యామ్, ఇతర గ్రూపుల నుంచి రూ.10లక్షల రుణం పొందాడు. దీనిని చెల్లించలేకపోవడంతో తరచూ దంపతులు మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో తన భర్త చనిపోతే రుణం తీర్చాల్సిన ఒత్తిడి ఉండదని భావించిన ఉమారాణి, తన తమ్ముడు జ్ఞానశేఖరన్ (35)తో కలిసి భర్తను చంపేందుకు స్కెచ్ వేసింది. మంగళవారం రాత్రి రవిచంద్రన్ నిద్రిస్తున్న సమయంలో అతడి చెవిలో వారిద్దరూ విషం పోశారు. మేల్కొన్న రవిచంద్రన్ వారి నుంచి తప్పించుకుని స్థానికుల సాయంతో కుంభకోణం ఆస్పత్రిలో చేరాడు. అతని ఫిర్యాదు ఆధారంగా, తిరువిడైమరదూర్ పోలీసులు కేసు నమోదు చేసి ఉమారాణి, జ్ఞానశేఖర్‌ను అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో మూడు నెలల క్రితమే ఆ ఇద్దరూ టీ లో విషం కలిపి అతన్ని చంపడానికి ప్రయత్నించారని, ఆ ఘటన నుంచి తప్పించుకున్న రవిచంద్రన్, అప్పటి నుంచి ఇంట్లో ఏమీ తినకుండా జాగ్రత్త పడుతున్నాడని తేలింది. ఈ క్రమంలో చెవిలో విషం పోసినట్లు నిర్ధారైణెంది. నిందితులిద్దరినీ కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్ నిమిత్తం తంజావూరు జైలుకు తరలించారు.



# సవాళ్లు - ప్రతి సవాళ్లు..

**చర్చలకు సిద్ధమైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు**

మన దునియా,హైదరాబాద్:జులై 02



తెలంగాణలో ప్రభుత్వ అప్పులు, గురుకులాల టెండర్లపై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగుతున్నాయి. దీంతో గత ప్రభుత్వ అప్పులపై చర్చకు సిద్ధమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కేటీఆర్ సిద్ధమైతే తెలంగాణ భవన్‌కు వస్తానంటూ జూపల్లి సవాల్ విసిరారు. దీంతో గురువారం ఉదయమే కేటీఆర్, హరీశ్ రావులు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. !మరో వైపు గురుకులాల టెండర్లలో అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ నేతలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. ఈ అంశంపై హరీశ్, కేటీఆర్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్ వస్తే గన్‌పార్క్‌కు వెళ్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనిపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రతి సవాల్ విసిరారు. ఈ రోజు ఉదయం 11.00 గంటలకు ఆధారాలతో ప్రెస్ క్లబ్‌కు వస్తానన్న ఆయన ప్రకటించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వస్తే.. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు ప్రెస్ క్లబ్‌కు వచ్చి చర్చిస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

కేటీఆర్‌కు మంత్రి అడ్లూరి సవాల్..

రాష్ట్రంలో అప్పులపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు మంత్రి అడ్లూరి సవాల్ విసిరారు. అసెంబ్లీలో చర్చకు లేఖ రాయాలని ఆయనను డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసి తోక ముడవడం కాదు.. వాటిని నిరూపించాలని హరీశ్ రావుకు సవాల్ చేశారు. హరీశ్ రావు ఆరోపణలు చేసి.. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చర్చకు రమ్మనడం ఏమిటని మంత్రి అడ్లూరి సందేహం వ్యక్తం చేశారు.ధైర్యం ఉంటే రూ.2వేల కోట్ల అవినీతి ఆరోపణలు నిరూపించాలని హరీశ్‌రావును ఆయన డిమాండ్ చేశారు. రూ.1100 కోట్ల టెండర్లలో రెండు వేల కోట్ల రూపాయిల అవినీతి అంటూ తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ చిట్టా తమ వద్ద ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అందరి లెక్కలు తేలుస్తామని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఈ రెండున్నరేళ్లలో భారీగా అప్పులు చేసిందని బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ స్పందించింది. గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ కూడా అత్యధికంగా అప్పులు చేసిందని మంత్రులు ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటికి తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉందని వారు గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో భారీగా అప్పులు చేశారని విమర్శించారు. దాంతో ఇరు పార్టీల నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకున్నారు..

# భార్యతో న్యూడ్ కాల్స్.. రాత్రికి రాత్రే లక్షల రూపాయలు సంపాదించిన భర్త

మన దునియా,తిరుపతి జిల్లా, కుప్పం:జులై 02



అగ్నిసాక్షిగా ప్రమాణం చేశాడు... ఏడడుగులు నడిచి నూరేళ్ల బంధానికి ముడివేశాడు. కష్టసుఖాల్లో తోడుంటానని నమ్మించాడు. కానీ, కాలం కలిసిరాక ఆర్థిక కష్టాలు చుట్టుముట్టేసరికి ఆ కట్టుకున్నవాడే 'కాసుల కక్కుర్తి'తో కసాయిగా మారాడు. భార్యను అర్ధనగ్నంగా లోకానికి చూపించి నోట్లు ఏరుకున్నాడు. చివరకు న్యాయం చేయాల్సిన రక్షకభటుడే భక్షకుడిగా మారి రాత్రికి రమ్మంటూ వేధించాడు! వినడానికే ఒళ్ళు గగుర్పొడిచే ఈ దారుణమైన చీకటి కథ తిరుపతి జిల్లా కుప్పం నియోజకవర్గంలో వెలుగుచూసింది.

లక్ష్మీదేవి లాంటి భార్య... లీలలు మొదలెట్టిన మొగుడు!

తిరుపతి జిల్లా, కుప్పం బాదురు సమీపంలోని కొత్త కండ్రిగ గ్రామం. అది కరోనా మహమ్మారి అతలాకుతలం చేసిన సమయం. వ్యాపారాలు దెబ్బతిన్నాయి, చేతిలో పైసలు లేవు. ఆ సమయంలోనే కొత్త కండ్రిగకు చెందిన మున్నుస్వామిరెడ్డి (పేరు మార్చబడింది) మైండ్‌లోకి ఒక వికృతమైన ఆలోచన వచ్చింది. "మనం బాగుపడాలంటే ఒకటే మార్గం... ఆన్‌లైన్‌లో న్యూడ్ కాల్స్ చేస్తే లక్షలు వస్తాయి" అంటూ తన భార్యకు మాయమాటలు చెప్పాడు. మొదట ససేమిరా అన్న ఆ పల్లెటూరి పడతిని, మన ఆర్థిక కష్టాలు తీరిపోతాయంటూ నమ్మబలికాడు. లక్ష్మీదేవి లాంటి భార్యను వికృతమైన సైబర్ ప్రపంచంలోకి నెట్టడానికి 'చామెట్' అనే యాప్‌లో ఆమె పేరుతో ఒక ఐడీ క్రియేట్ చేశాడు.

'బ్లాక్‌మెయిల్' తో మొదలైన నగ్న నరకం!

భార్య శరీరాన్ని ఎరగా వేసి మున్నుస్వామిరెడ్డి లక్షల రూపాయలు సంపాదించాడు. డబ్బు రుచి మరిగిన ఆ కామాంధుడికి ఆశ ఇంకా పెరిగింది. అయితే, రోజులు గడుస్తున్న కొద్దీ పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. "ఇక మీదట నేను ఈ పాపపు పని చేయను, నా బిడ్డల భవిష్యత్తు ముఖ్యం" అని ఆ భార్య తేల్చి చెప్పింది. అంతే... మునిరత్నంరెడ్డిలోని అసలు రాక్షసుడు బయటపడ్డాడు. "నువ్వు కాల్స్ చేయకపోతే నేను చచ్చిపోతా" అంటూ బ్లాక్‌మెయిల్ డ్రామాలు మొదలుపెట్టాడు. అయినా వినకపోవడంతో రోజూ కొట్టడం, తిట్టడం, బలవంతంగా గదిలో బంధించి న్యూడ్ వీడియో కాల్స్ చేయించడం నిత్యకృత్యంగా మార్చుకున్నాడు. ఆ నరకం భరించలేక, ఒకరోజు ఆమె తన చిన్న కూతురిని తీసుకుని ఇల్లు వదిలి పారిపోయింది. కానీ, రాక్షసుడి చెరలో ఉన్న తన పెద్ద కూతురిని చూడటానికి వెళ్లిన సమయంలో, మున్నుస్వామిరెడ్డి ఆమెపై జంతువులా దాడి చేసి రక్తం వచ్చేలా గాయపరిచాడు.

వీడియో వైరల్... దొంగే దొంగ అన్నట్టు విడాకుల వేధింపులు!

కథ ఇక్కడితో ఆగలేదు. విధి ఆ అభాగ్యురాలితో మరో వింత నాటకం ఆడింది. ఆమె చేసిన ఒక పాత న్యూడ్ వీడియో కాల్‌ను గుర్తుతెలియని వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఊరు, వాడ ఆ వీడియో చూసి ఆమెను చులకనగా చూడటం మొదలుపెట్టాయి. ఇదే అదనుగా భావించిన ఆ కిరాతక భర్త మున్నుస్వామిరెడ్డి, తనేదో పతివ్రతుడిలా నాటకమాడటం మొదలుపెట్టాడు. "నీ వీడియో వైరల్ అయింది, సమాజంలో నా పరువు పోయింది, నాకు విడాకులు కావాలి" అంటూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. అంతటితో ఆగక, ఆమె సంపాదించిన రూ. 18 లక్షల నగదును, ఒంటి మీదున్న బంగారు నగలను గుంజుకుని ఆమెను నడిరోడ్డుపైకి నెట్టేశాడు.

ఖాకీల నీడలో కామపిశాచి... కానిస్టేబుల్ అసభ్య లీలలు!

కట్టుకున్నవాడు కాటు వేస్తే, న్యాయం కోసం ఆమె పోలీసులను ఆశ్రయించింది. కానీ, అక్కడ ఆమెకు ఎదురైన అనుభవం చట్టం మీదే అసహ్యం కలిగించేలా చేసింది. బాధితురాలు తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళితే... అక్కడ కూడా ఆమెకు చులకన భావమే ఎదురైంది. సహాయం చేయాల్సిన పోలీసులు ఆమెను హీనంగా చూశారు. అన్నింటికంటే ఘోరం... ఆర్సీపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఒక కానిస్టేబుల్, ఆమె దీనస్థితిని ఆసరాగా చేసుకోవాలని చూశాడు. "నీ వీడియో నేను చూశాను... కేసు పెట్టాలంటే రాత్రికి నా దగ్గరకు రావాలి" అంటూ అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ లైంగిక వేధింపులకు గురిచేశాడు.

బిడ్డల కోసం తల్లి పోరాటం!

కట్టుకున్న భర్త కసాయి అయ్యాడు... కాపాడాల్సిన ఖాకీలు కామపిశాచులయ్యారు. ఇప్పుడు ఆ అభాగ్యురాలు మీడియా ముందుకొచ్చి కన్నీరుమున్నీరవుతోంది. "నా జీవితం ఎలాగూ నాశనమైంది. కానీ ఎదుగుతున్న నా ఇద్దరు బిడ్డలను కూడా ఆ రాక్షసుడు రేపు ఇదే నరకంలోకి లాగుతాడు. దయచేసి నా బిడ్డలను నాకు ఇప్పించండి" అంటూ ఆమె ఆక్రందిస్తోంది. మరి ఈ 'చామెట్' యాప్ ముఠా వెనుక ఉన్న మున్నుస్వామిరెడ్డిపై, ఆ కామ కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి!

# ప్రేమ ముసుగులో మోసాలు..!

**ప్రేమ పేరుతో నమ్మించి.. జీవితాలతో చెలగాటం?**

**డబ్బు, హోదా, పలుకుబడి చట్టానికి అతీతం కాదు**

**బాధితురాలినే నిందించే ధోరణిపై ఆందోళన**

**అనుమానాస్పద ప్రైవేట్ కార్యాలయాలు, హోటళ్లు, లాడ్జీలపై తనిఖీలు పెంచాలని ప్రజల విజ్ఞప్తి**

**మన దునియా,వరంగల్,జులై 02:**

ప్రేమ అనేది విశ్వాసానికి, పరస్పర గౌరవానికి ప్రతీక. ఇద్దరి జీవితాలను ఒక్కటిగా చేసే పవిత్ర బంధం. అయితే అదే ప్రేమను కొందరు స్వార్థానికి, మోసానికి, లైంగిక దోపిడీకి సాధనంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఇటీవలి కాలంలో వివిధ ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి.కొన్ని ఘటనల్లో ఆర్థికంగా బలంగా ఉన్నవారు లేదా పలుకుబడి కలిగిన వ్యక్తులు యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వివాహం చేసుకుంటామని హామీ ఇచ్చి మోసం చేశారనే ఫిర్యాదులు నమోదవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో వివాహితులపైనా ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. డబ్బు, హోదా లేదా సామాజిక ప్రభావం ఉంటే చట్టపరమైన పరిణామాలను తప్పించుకోవచ్చనే భావన సమాజానికి ప్రమాదకరమని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఎవరైనా బాధితులు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించినప్పుడు, కొన్ని సందర్భాల్లో బాధితుల వ్యక్తిత్వాన్ని ప్రశ్నించడం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

అయితేవంటి ఆరోపణల నిజానిజాలు సంబంధిత దర్యాప్తులోనే తేలాల్సి ఉంటుంది.

ఇలాంటి వ్యవహారాల్లో బాధితులకు న్యాయం జరిగేలా నిష్పాక్షికంగా, పారదర్శకంగా విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మహిళలపై జరిగే నేరాల విషయంలో ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా చట్టం తన పని తాను చేయాలని అభిప్రాయపడుతున్నారు.పేమ పేరుతో మోసాలు, వివాహ వాగ్దానాలతో దగా, మహిళలపై మానసిక, శారీరక దోపిడీ వంటి ఆరోపణలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో నగరంలోని అనుమానాస్పద ప్రైవేట్ కార్యాలయాలు, హోటళ్లు, లాడ్జీలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచిస్తున్నారు.ఇటీవలి కాలంలో వివిధ ప్రాంతాల్లో ప్రభావశీల కుటుంబాలకు చెందిన వ్యక్తులపైనా చట్టపరమైన చర్యలు తీసుకున్న సందర్భాలు వెలుగులోకి రావడం ద్వారా చట్టం ముందు ఎవరూ అతీతులు కాదనే సందేశం మరోసారి స్పష్టమైందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి. ఎవరి హోదా, ఆస్తి, పలుకుబడి ఎంత ఉన్నప్పటికీ, చట్ట ప్రక్రియ అందరికీ




సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రేమ అనేది విశ్వాసాన్ని నిలబెట్టే బంధంగా ఉండాలి గానీ, మోసానికి ఆయుధంగా మారకూడదు. సమాజంలో మహిళల భద్రత, గౌరవం, న్యాయం కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పరిశీలకులు సూచిస్తున్నారు. గమనిక: ఈ కథనం సమాజంలో వెలుగులోకి వస్తున్న ధోరణులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించబడింది. ఇందులో పేర్కొన్న అంశాలు ఏ ఒక్క వ్యక్తి, కుటుంబం లేదా పెండింగ్‌లో ఉన్న నిర్దిష్ట కేసును ఉద్దేశించినవి కావు. చట్టపరమైన అంశాల్లో నిజానిజాలు సంబంధిత దర్యాప్తు మరియు న్యాయ ప్రక్రియ ద్వారానే తేలుతాయి.

# పెళ్లయి వారం కాకముందే విషాదం


**24న పెళ్లి.. 26న రిసెప్షన్.. 29న పుట్టినరోజు.. 30న మరణం**

**తండ్రి ప్రాణాలు కాపాడబోయి విద్యుత్ షాక్‌తో నవవరుడు మృతి**

**చేతి మెహందీ ఆరకముందే భర్తను కోల్పోయిన నవవధువు**

**మన దునియా,హనుమకొండ:జులై 02**

ఆ ఇంట్లో పెళ్లి సంబరాలు ముగిసి వారం కూడా కాలేదు. బంధుమిత్రుల సందడి, శుభాకాంక్షల సంద్రం ఇంకా తగ్గలేదు. జూన్ 29న తన పుట్టినరోజును కుటుంబ సభ్యులు, నవవధువుతో కలిసి ఎంతో ఆనందంగా జరుపుకున్న నవవరుడు... మరుసటి రోజే విధి వింత ఆటలో కన్నుమూయడంతో ఆ ఇంట్లో ఆనందం క్షణాల్లోనే విషాదంగా మారింది.హనుమకొండ పరిధిలోని భీమారానికి చెందిన శరత్‌కు ఈ నెల 24న మౌనికతో ఘనంగా వివాహం జరిగింది. అనంతరం జూన్ 26న కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో రిసెప్షన్‌ను వైభవంగా నిర్వహించారు. పెళ్లి వేడుకల ఆనందం ఇంకా కొనసాగుతుండగానే, జూన్ 29న శరత్ తన పుట్టినరోజును కూడా సంతోషంగా జరుపుకున్నాడు.అయితే జూన్ 30న ఇంట్లో జరిగిన ప్రమాదం వారి జీవితాలను శాశ్వతంగా మార్చేసింది. శరత్ తండ్రి సాంబయ్య ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురికావడంతో, ఆయనను కాపాడేందుకు శరత్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ముందుకు దూసుకెళ్లాడు. తండ్రిని విద్యుత్ వైర్ల నుంచి విడిపించే ప్రయత్నంలో శరత్‌కు కూడా తీవ్ర కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సాంబయ్య ప్రాణాలతో బయటపడినా, తన కళ్ల ముందే కొడుకు మృతిచెందడం చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.పెళ్లయిన ఐదు రోజులకే, పుట్టినరోజు జరుపుకున్న మరుసటి రోజే భర్తను కోల్పోవడంతో నవవధువు మౌనిక తీవ్ర విషాదంలో మునిగిపోయింది. చేతికి పెట్టుకున్న మెహందీ ఆరకముందే, మెడలో కట్టిన పసుపు తాడు పచ్చగా ఉండాలనే ఆశలు ఐదు రోజులకే ఆవిరైపోవడంతో ఆమెను ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.ఈ హృదయవిదారక ఘటనతో భీమారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# భూకబ్జాదారుల నుంచి తన కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలి.. బాధితురాలు స్వరూప

**మన దునియా,హనుమకొండ,జులై 02**

హసన్‌పర్తి మండలం అనంతసాగర్ రెవెన్యూ శివారులో తమ కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని బాధితురాలు స్వరూప ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ తమకు రక్షణ కల్పించి, భూమిని కాపాడాలని జిల్లా యంత్రాంగం, పోలీసులను కోరారు. అనంతసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 74/బీ, 73/ఏ/1, 77/ఏ/1, 78/బీలో మొత్తం 4.03 ఎకరాల భూమి ఉండగా, అందులో 1 ఎకరం 6 గుంటల భూమి తన భర్త వైద్యుల సమ్మిరెడ్డికి చెందినదని స్వరూప తెలిపారు. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన వైద్యుల ప్రతాప్ రెడ్డి, వైద్యుల తిరుపతి రెడ్డి, ప్రమీలతో పాటు మరికొందరు కుటుంబ సభ్యులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.తమ భూమిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ధారించి పాతిన సరిహద్దు రాళ్లను ధ్వంసం చేశారని ఆమె ఆరోపించారు. తన అత్తమామల నుంచి భర్త సమ్మిరెడ్డికి, అనంతరం తన పేరుపై భూమి బదిలీ జరిగిందని, ప్రస్తుతం తమ పేరుపై తెలంగాణ పాస్‌బుక్ ఉండటంతో పాటు రైతుబంధు సాయం కూడా తమ ఖాతాలో జమవుతోందని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో




భూమి వద్దకు వెళ్లిన సమయంలో ప్రతాప్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రమీల తనపై దాడి చేశారని, ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్వరూప వెల్లడించారు. తమ కుటుంబానికి ఎలాంటి ప్రాణహాని కలగకుండా హసన్‌పర్తి పోలీసులు ప్రత్యేక రక్షణ కల్పించాలని, అలాగే జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మండల రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని వంశపారంపర్యంగా వస్తున్న తమ భూమిని భూకబ్జాదారుల నుంచి రక్షించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఎస్సైని లంచ్ టైం వరకు నిలబెట్టిన హైకోర్టు!

**మన దునియా,హైదరాబాద్:జులై 02**





పోలీస్ అయినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘిస్తావా అంటూ మధురానగర్ ఎస్సైపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఎస్సై అయిన పిటిషనర్ ఉస్మాన్(75)ను లోదుస్తుల్లో ఉండగా ఇంటి నుంచి ఈడ్చుకెళ్లడంపై మండిపడింది. మధ్యాహ్న భోజన సమయం వరకు కోర్టులోనే నిలబడాలని ఎస్సైని ఆదేశించింది. పోలీస్ కమిషనర్ నుంచి నివేదిక తెప్పించుకుని అందజేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. మే 18న యూస్‌ఫగూడలోని తన ఇంటిలో ఉండగా పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ రిటైర్డ్ ఎస్సై ఉస్మాన్ పిటిషన్ దాఖలు చేయగా.. జస్టిస్ టీ.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది..

## ములుగు జిల్లాలోని నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులును ప్రకటించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్

**మన దునియా, వాజేడు ,జులై 2**

ములుగు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను జులై 02-07-2026 న తారీఖున గురువారం రోజున రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి సంక్షేమ శాఖ మాత్యులు దనసరి అనసూయ ( సీతక్క) సూచనల మేరకు ములుగు జిల్లాలోని అన్ని మండలాలలో నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులును ప్రకటించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, మల్లంపల్లి ,చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, ములుగు ,ముసినేపల్లి కుమార్ గౌడ్ వెంకటాపూర్, బండి శ్రీనివాస్, గోవిందరావుపేట, పాలడుగు వెంకట కృష్ణ, తాడ్వాయి, మంకిడి నరసింహస్వామి, ఏటూరు నాగారం, దేవులపల్లి విజయ్ కుమార్, ఏటునాగారం టౌన్, కే రంజిత్ కుమార్, కన్నాయిగూడెం, జాడి రాంబాబు, మంగపేట, చెట్టుపల్లి వెంకటేశ్వర్లు.ఈ సందర్భంగా కొత్తగా ఎన్నిక కాబడిన వారందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని మండలాల అధ్యక్షులు కృషి చేయాలి అని తెలుపుతూ మాజీ అధ్యక్షులకు సముషిత స్థానం కల్పిస్తామని తెలియజేశారు


Mobile: 9000333666
Phone: 040-24602484
24603718, 24602383
E-mail: bommamahesh@gmail.com

TELANGANA PRADESH CONGRESS COMMITTEE
Gandhi Bhavan, Nampally, Hyderabad-500001.

B. MAHESH KUMAR GOUD M.L.C.
President

30 June, 2026

ORDER

In consultation with Shri Paidakula Ashok Kumar Patel, President, Mulugu District Congress Committee, the proposals for the appointment of **Mandal / Town Presidents** in **Mulugu** Assembly Constituency of **Mulugu** District has been approved, with immediate effect.

| Sl. No. | Name of the Mandal / Town | Name of the President |
|---|---|---|
| 1 | Mallampally | Shri Cherukupalli Srikanth Reddy |
| 2 | Mulugu | Shri Musinepally Kumar Goud |
| 3 | Venkatapur | Shri Bandi Srinivas |
| 4 | Govindaraopet | Shri Paladugu Venkatakrishna |
| 5 | Tadvai | Shri Mankidi Narasimha Swamy |
| 6 | Eturunagaram | Shri Devulapalli Vijay Kumar |
| 7 | Eturunagaram Town | Shri K.Ranjith Kumar |
| 8 | Kannayigudem | Shri Jadi Rambabu |
| 9 | Mangapet | Shri Chittipelli Venkateshwarlu |

We sincerely hope and trust you will strengthen the Congress party by striving hard and put in every nerve to build up the organization from gross-root level.

(B. MAHESH KUMAR GOUD, MLC)
President, Telangana Pradesh Congress Committee

Scanned with OKEN Scanner

## ప్రభుత్వ టీచర్లు, సిబ్బందికి కేబినెట్ తీపికబురు

**ఇక విద్యార్థులతో పాటే ఉచిత భోజనం**

**మన దునియా,హైదరాబాద్:జులై 02**

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న తెలంగాణ తొలి 'ఈ-కేబినెట్' భేటీలో విద్యా రంగానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు.ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఉచితంగా అల్పాహారం , మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం, కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతోంది. అయితే, ఇకపై పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులతో పాటు రోజంతా విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి కూడా ఈ ఉచిత భోజన సదుపాయాన్ని విస్తరించాలని కేబినెట్ తీర్మానించింది. తాగాజ నిర్ణయంతో విద్యాసంస్థల్లో నాణ్యమైన సమయం గడపడానికి, టీచర్లు సకాలంలో అందుబాటులో ఉండటానికి మరింత వీలు కలుగుతుందని సర్కార్ భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## ఉద్యమకారుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మన దునియా,వరంగల్:జులై 02**

వరంగల్: తెలంగాణ ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా వారి ప్రజాస్వామ్య హక్కులను అణిచివేయలేరని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని చేపట్టనున్న భూ పోరాటానికి మద్దతుగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఉద్యమకారులను సమీకరిస్తున్న తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకుడు మడిపెల్లి సుశీల్ గౌడ్‌ను శుక్రవారం ఉదయం వరంగల్ మట్టేవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.ఈ చర్య ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని, శాంతియుతంగా ఉద్యమంలో పాల్గొనే హక్కును పోలీసులు హరించరాదని స్థానికులు, ఉద్యమకారులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి అరెస్టులకు పాల్పడడం సరైన విధానం కాదని వారు విమర్శించారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం


## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎమ్‌జీ పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం









**సంగెం మన దునియా జులై 02**

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్షణం అని ఆయన అన్నారు సంగం మండల పరిధిలోని తీగరాజు పల్లి లో ఇందిరమ్మ ఇండ్లు నూతన గృహప్రవేశాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు అనంతరము నియోజకవర్గంలోని దామెర మండల పరిధిలోని దుర్గంపేట ఊరుగొండ పసరగొండ దమ్మన్నపేట ఓబులాపూర్ లాదెళ్ల దామెర కోకిలవాయి గ్రామాల్లో కోటి 26 లక్షల 50వేల విలువైన సిసి రోడ్లు డ్రైనేజ్ పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వము రాష్ట్ర ప్రజల అవసరాలకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే నేపథ్యంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు దామెర మండలాన్ని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకు రావడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తూ ప్రతి కుటుంబము ఆర్థికంగా ఎదగడం కోసము పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న మనీ ఆయన తెలిపారు రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు మొదటి పేజ్ లో పూర్తి అయినందున త్వరలో రెండో పేజీలో అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలతో ప్రమేయం లేకుండా ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఆయన అన్నారు ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులైన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని దరఖాస్తు పెట్టుకున్న ప్రతి కుటుంబానికి ఇల్లు వస్తాయని ఆయన హామీ ఇచ్చారు గత బి ఆర్ ఎస్ కుటుంబ పాలన చేతుల్లో గ్రామాల్లోని అభివృద్ధి పనులు నిరాధారణకు నిర్లక్ష్యానికి గురి అయిన గ్రామాలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు వేగంగా చెందుతున్నాయని ప్రజా సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో మరిన్ని నూతన సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి ప్రాణాలికలు సిద్ధం చేస్తుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని గ్రామాల్లో మౌలిక వసతులను అభివృద్ధి పరుచుట కోసము కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వము కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలో కేజీ నుండి పదవ తరగతి వరకు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోనే బోధించబడుతుందని కేవలము హిందీ మాదిరిగానే తెలుగు సబ్జెక్టు ఉంటుందని విద్యా పిల్లలకు పూర్తి ఉచితమని విద్యకు సంబంధించిన బుక్స్ డ్రెస్సులు షూలు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం సాయంకాలం మార్చి నెలలో 10వ తరగతి పరీక్షలు రాసే క్రమంలో వారికి సాయంకాలం స్నాక్స్ టీలు అందించే ఏర్పాట్లు చేశామని ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల చే బోధన జరుగుతుందని ప్రైవేట్ పాఠశాలలో బేసిక్ చదివి న వారితో ప్రైవేట్ పాఠశాలలో విద్యను బోధిస్తున్నారని దీనితో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని ఆయన అన్నారు గ్రామాల్లో ప్రతి కుటుంబము తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపియకుండా ప్రభుత్వ పాఠశాలలో పంపించి విద్యార్థుల సంఖ్య పెంచి ప్రభుత్వ పాఠశాలను కాపాడు కోవలసిన బాధ్యత అందరిపై ఉందని సర్పంచులు స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధి కోసం ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సర్పంచులు అధికారులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు

# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# గత ఇంగ్లండ్ టూర్లో నన్ను సరిగా ఉపయోగించుకోలేదు: శార్దూల్ ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు

**2025లో ఇంగ్లండ్ లో పర్యటించిన టీమిండియా**

**ఐదు టెస్టుల సిరీస్ లో టీమిండియా-ఇంగ్లండ్ ఢీ**

**వికెట్లు తీస్తున్నా తనను బౌలింగ్ నుంచి తప్పించారని శార్దూల్ ఠాకూర్ ఆరోపణ**

**కెప్టెన్ గిల్, కోచ్ గంభీర్‌తో అప్పుడు మాట్లాడలేదని వెల్లడి**

**తిరిగి టెస్ట్ జట్టులోకి రావడమే లక్ష్యమని స్పష్టం**



టీమిండియా సీనియర్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్, జట్టు యాజమాన్యంపై తన అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కాడు. గతేడాది (2025) ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో తనను సరిగ్గా వినియోగించుకోలేదని సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) 2026-27 సీజన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు.ఆ సిరీస్‌లో తనకు తగినన్ని బౌలింగ్ అవకాశాలు ఇవ్వలేదని, సరైన సమయంలో తనను బౌలింగ్‌కు తీసుకురాలేదని శార్దూల్ అన్నాడు. "లీడ్స్ టెస్టులో నేను బెన్ డకెట్, హ్యారీ బ్రూక్ వికెట్లను వెంటవెంటనే తీశాను. అయినా నన్ను వెంటనే బౌలింగ్ నుంచి తప్పించారు. ఆ సమయంలో మరికొంత సేపు బౌలింగ్ చేసి ఉంటే, మనం ఓడిపోయిన ఆ మ్యాచ్ ఫలితం మరోలా ఉండేదేమో" అని శార్దూల్ అభిప్రాయపడ్డాడు. 2-2తో డ్రాగా ముగిసిన ఈ సిరీస్‌లో శార్దూల్ కేవలం 2 మ్యాచ్‌లే ఆడాడు. మొత్తం మీద 27 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 2 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో 46 పరుగులు చేశాడు. అయితే, మాంచెస్టర్ టెస్టులో క్లిష్ట పరిస్థితుల్లో 88 బంతులు ఎదుర్కొని 41 పరుగులు చేసి, జట్టు మంచి స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించానని గుర్తుచేశాడు.సిరీస్ మధ్యలో ఈ విషయంపై కెప్టెన్ శుభ్‌మన్ గిల్ లేదా కోచ్ గౌతమ్ గంభీర్‌తో చర్చించలేదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టి పెట్టానని తెలిపాడు. గత దేశవాళీ సీజన్‌లో అద్భుతంగా రాణించానని, ఇప్పుడు తిరిగి టెస్ట్ జట్టులో స్థానం సంపాదించడమే తన లక్ష్యమని 34 ఏళ్ల శార్దూల్ స్పష్టం చేశాడు."భారత జట్టుకు మళ్లీ ఆడాలనే కోరిక నాలో 100 శాతం ఉంది. జట్టు నుంచి తప్పించినా, పక్కన పెట్టినా 'ఆశ' అనే పదం చాలా శక్తివంతమైనది. ఆశ బతికి ఉన్నంత వరకు ఏదైనా సాధ్యమే. భవిష్యత్తులో ఎప్పుడు పిలుపు వచ్చినా దేశం కోసం ఆడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను" అని శార్దూల్ ధీమా వ్యక్తం చేశాడు.

# సూర్యవంశీ ఆటకోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది: మాజీ సెలెక్టర్



**త్వరలో 3 ఫార్మాట్లలోనూ వైభవ్ ఆడతాడని కరీమ్ ధీమా**

**ఏ బౌలింగ్‌నైనా ఎదుర్కొగలడని ప్రశంస**

**వైభవ్ ప్రతిభ గురించి ముందే తెలిసిందన్న మాజీ సెలెక్టర్**

ఐపీఎల్-2026లో సంచలన ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ భారత వికెట్‌కీపర్, మాజీ సెలెక్టర్ సబా కరీమ్ ప్రశంసల వర్షం కురిపించాడు. భారత అభిమానులతో పాటు ప్రపంచమంతా అతని ఆటను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తోందని అన్నాడు. త్వరలోనే భారత్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ సూర్యవంశీ ఆడతాడని తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పాడు.ఐపీఎల్-2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన సూర్యవంశీ 776 పరుగులు చేసి, 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ అద్భుత సీజన్ తర్వాత గుర్తుండిపోయే ఐపీఎల్ సీజన్ ఏదైనా ఉంటే అది సూర్యవంశీదేనని సబా కరీమ్ అభిప్రాయపడ్డాడు. అగ్రశ్రేణి బౌలర్లపై అతను ఆడిన తీరు అసాధారణమని కొనియాడాడు.ఐపీఎల్-2025 వేలానికి ముందే సూర్యవంశీ ప్రతిభ గురించి తనకు సమాచారం వచ్చిందని కరీమ్ గుర్తు చేసుకున్నాడు. అతడికి కనీసం ఒక మ్యాచ్‌లోనైనా అవకాశం రావాలని కోరుకున్నానని, తొలి బంతినే ధైర్యంగా ఎదుర్కొన్న తీరు తనను ఆశ్చర్యపరిచిందన్నాడు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆడటమే సూర్యవంశీ ప్రత్యేకత అని చెప్పాడు. రెండో సీజన్‌లో బౌలర్లు అతడిపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తారనే అంచనాలు ఉన్నప్పటికీ, అలాంటి ఇబ్బందులు ఎదురుకావని తాను ముందే భావించానన్నాడు. రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ కూడా ఇదే విషయాన్ని చెప్పారని వెల్లడించాడు. వేగవంతమైన బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు సూర్యవంశీ తన ఆటలో అప్పర్‌కట్, కవర్స్ డ్రైవ్, ఇన్‌సైడ్-అవుట్ వంటి కొత్త షాట్లను జోడించాడని, ఏ పరిస్థితుల్లోనైనా రాణించే సామర్థ్యం అతనికి ఉందని ప్రశంసించాడు.

# ఒక్క రెడ్ కార్డ్.. 1 మిలియన్ డాలర్ల ఉచిత పిజ్జాలు.. డొమినోస్ బంపరాఫర్!

**ఫిఫా వరల్డ్ కప్‌లో అమెరికా ఆటగాడికి రెడ్ కార్డ్**

**ఫ్యాన్స్‌కు 1 మిలియన్ డాలర్ల విలువైన ఉచిత పిజ్జాలు ప్రకటించిన డొమినోస్**

**టోర్నమెంట్‌కు ముందే ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్న సంస్థ**

**జూన్ 10లోపు రిజిస్టర్ చేసుకున్న వారికే ఈ ఆఫర్ వర్తిస్తుందని వెల్లడి**

**రెడ్ కార్డ్ ఎదురైనా మ్యాచ్ గెలిచి రౌండ్ ఆఫ్ 16కు దూసుకెళ్లిన యూఎస్**


ప్రముఖ పిజ్జా దిగ్గజం డొమినోస్, అమెరికా ఫుట్‌బాల్ అభిమానులకు ఓ భారీ శుభవార్త అందించింది. ఫిఫా వరల్డ్ కప్ 2026లో అమెరికా ఆటగాడికి రెడ్ కార్డ్ చూపడంతో, ఏకంగా 1 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 9.49 కోట్లు) విలువైన 'ఎమర్జెన్సీ పిజ్జాల'ను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. నిన్న బోస్నియా అండ్ హెర్జెగోవినాతో జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో అమెరికా స్టార్ స్ట్రైకర్ ఫోలారిన్ బలోగన్‌కు రెడ్ కార్డ్ చూపడంతో ఈ బంపరాఫర్ అమల్లోకి వచ్చింది.అయితే, ఇది డొమినోస్ అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు. ఈ ఏడాది మే నెలలోనే, టోర్నమెంట్ ప్రారంభానికి ముందు, డొమినోస్ ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రకటించింది. వరల్డ్ కప్‌లో అమెరికా జట్టు ఆటగాళ్లలో ఎవరికైనా రెడ్ కార్డ్ ఇస్తే, అభిమానుల నిరాశను తగ్గించేందుకు 1 మిలియన్ డాలర్ల విలువైన పిజ్జాలను ఉచితంగా పంపిణీ చేస్తామని వాగ్దానం చేసింది. ఇందులో భాగంగా 60,000కు పైగా మీడియం పిజ్జాలను అందించనుంది. ఇప్పుడు బలోగన్‌కు రెడ్ కార్డ్ రావడంతో డొమినోస్ తన మాటను నిలబెట్టుకుంది.

రెడ్ కార్డ్ వచ్చినా చారిత్రక విజయం

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. బలోగన్‌కు రెడ్ కార్డ్ చూపినా అమెరికా జట్టుపై ప్రతికూల ప్రభావం పడలేదు. మ్యాచ్ ద్వితీయార్థంలో బలోగన్ మైదానం వీడిన తర్వాత 82వ నిమిషంలో మాలిక్ టిల్‌మాన్ ఫ్రీ-కిక్‌తో మరో గోల్ సాధించి అమెరికా విజయాన్ని ఖాయం చేశాడు. దీంతో బోస్నియాపై 2-0 తేడాతో గెలిచి, రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. గత 24 ఏళ్లలో వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లో అమెరికాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ చారిత్రక విజయంతో పాటు ఉచిత పిజ్జాల ఆఫర్ రావడంతో అమెరికా అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఉచిత పిజ్జా పొందడం ఎలా?

ఈ ఆఫర్ పొందడానికి డొమినోస్ కొన్ని నిబంధనలు విధించింది. జూన్ 10 రాత్రి 11:59 గంటలలోపు డొమినోస్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని, 'డొమినోస్ రివార్డ్స్' కార్యక్రమంలో చేరిన వారికి మాత్రమే ఈ ఉచిత 'ఎమర్జెన్సీ పిజ్జా' లభిస్తుంది. అర్హులైన కస్టమర్లకు దీనికి సంబంధించిన సమాచారం అందుతుంది. వారు ఈ ఆఫర్‌ను జులై 2 లోపు రీడీమ్ చేసుకోవాల్సి ఉంటుంది.మరోవైపు ఈ టోర్నీలో ఇప్పటికే మూడు గోల్స్‌తో అదరగొట్టిన బలోగన్‌కు ఈ రెడ్ కార్డ్ ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అతను చేసిన ఫౌల్ తీవ్రతను బట్టి అధికారులు అతనిపై రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల నిషేధం విధించే సూచనలు కనిపిస్తున్నాయి. వరల్డ్ కప్ ప్రచారంలో భాగంగా డొమినోస్, 'సాటర్డేస్ ఫుట్‌బాల్' అనే సంస్థతో కలిసి ప్రత్యేకంగా జెర్సీలు, క్యాప్‌లు వంటి వస్తువులను కూడా విక్రయిస్తోంది. మొత్తానికి ఈ ఒక్క రెడ్ కార్డ్ అభిమానులకు రుచికరమైన పిజ్జాలను, డొమినోస్‌కు భారీ ప్రచారాన్ని అందించింది.






# వైభవ్ అరంగేట్రం ఆలస్యం.. గవాస్కర్ కీలక వ్యాఖ్యలు

**ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ వైభవ్‌కు దక్కని అవకాశం**

**15 ఏళ్ల వయసులో ఒత్తిడిని పెద్దగా పట్టించుకోరని అభిప్రాయపడ్డ గవాస్కర్**

**సీనియర్ ఆటగాళ్ల నుంచి నేర్చుకోవడం వైభవ్‌కు లాభమని సూచన**

**వర్షం కారణంగా తొలి టీ20 రద్దు**

యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి టీమిండియా తరఫున ఆడే అవకాశం కల్పించడంలో మరింత ఆలస్యం చేస్తే అతడిపై ఒత్తిడి పెరుగుతుందని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కకపోవడంపై ఆయన స్పందించారు. అవకాశం ఎంత ఆలస్యమైతే అతడిపై అంతగా అంచనాలు పెరుగుతాయని పేర్కొన్నారు."వైభవ్‌కు అవకాశం వచ్చినప్పుడు వెంటనే తనను తాను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకే ఆలస్యం అతడిపై మరింత ఒత్తిడిని పెంచుతుంది. అయితే 15 ఏళ్ల వయసులో ఆటగాళ్లు ఒత్తిడి గురించి ఎక్కువగా ఆలోచించరు" అని గవాస్కర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ భారత జట్టులోని సీనియర్ ఆటగాళ్లతో కలిసి ఉండడం, వారి నుంచి నేర్చుకోవడం వైభవ్‌కు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఐర్లాండ్ సిరీస్‌లోనూ బెంచ్‌కే పరిమితమైన వైభవ్‌కు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో కూడా అవకాశం లభించలేదు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లతో కూడిన ఓపెనింగ్ కాంబినేషన్‌పైనే జట్టు యాజమాన్యం మరోసారి నమ్మకం ఉంచింది. కాగా వర్షం కారణంగా ఇంగ్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్ ఫలితం తేలకుండా రద్దయింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## వివాహ బంధంలోకి బోనీ కపూర్ కుమార్తె.. ఈ నెల 6న బాయ్ ఫ్రెండ్ తో అన్షులా పెళ్లి

అన్షులా కపూర్ పెళ్లి తేదీ ఖరారు

ధృవీకరించిన బోనీ కపూర్

అన్షులాకు డేటింగ్ యాప్‌లో పరిచయమైన స్క్రీన్‌రైటర్ రోహన్ థక్కర్

2025 అక్టోబర్‌లో ముంబైలో వీరి నిశ్చితార్థం

జూన్ 21న 'మాతా కీ చౌకీ'తో ఘనంగా ప్రారంభమైన పెళ్లి వేడుకలు



బాలీవుడ్ ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుమార్తె అన్షులా కపూర్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టనున్నారు. ఆమె తన ప్రియుడు, స్క్రీన్‌రైటర్ రోహన్ థక్కర్‌ను పెళ్లాడబోతున్నారు. వీరి వివాహం జులై 6న జరగనున్నట్లు బోనీ కపూర్ స్వయంగా ధృవీకరించారు. రెండు కుటుంబాల సంప్రదాయాలను మిళితం చేస్తూ, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుకను ఒక్క రోజులోనే పూర్తి చేయనున్నారు.ఈ పెళ్లి వేడుకలు జూన్ 21న 'మాతా కీ చౌకీ'తో ఘనంగా ప్రారంభమయ్యాయి. వరుడి కుటుంబం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కపూర్ కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. అర్జున్ కపూర్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌తో పాటు కుటుంబ సభ్యులంతా సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను అన్షులా, అర్జున్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.అన్షులా, రోహన్ ఒక డేటింగ్ యాప్ ద్వారా పరిచయమయ్యారు. గతేడాది జులైలో న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్క్‌లో రోహన్ ఆమెకు ప్రపోజ్ చేశారు. ఆ తర్వాత 2025 అక్టోబర్‌లో ముంబైలో వీరి నిశ్చితార్థం కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగింది.వివాహం అనంతరం సినీ పరిశ్రమకు చెందిన స్నేహితుల కోసం ప్రత్యేకంగా ఒక కాక్‌టెయిల్ పార్టీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు 'మోడరన్ ఇండియన్' డ్రెస్ కోడ్ పాటించాలని నిర్వాహకులు కోరారు.

## రజినీకాంత్ 'జైలర్ 2' రిలీజ్ డేట్ ఫిక్స్... మరోసారి బాక్సాఫీసును షేక్ చేసేందుకు తలైవా రెడీ!

అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్త విడుదల

కీలక పాత్రల్లో మోహన్‌లాల్, విజయ్ సేతుపతి

తొలి భాగానికి మించి యాక్షన్ ఉంటుందని అంచనా

సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెడుతూ, కొత్త రిలీజ్ డేట్ టీజర్‌ను కూడా విడుదల చేసింది.ఈ టీజర్‌లో విలన్ పాత్రధారి వినాయకన్.. "నన్ను చంపి ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్! ఇది చాలా పెద్ద నెట్‌వర్క్. ఎవరు, ఎప్పుడు, ఎలా వస్తారో కూడా నీకు తెలియదు. నీ జీవితం నరకంగా మారుతుంది" అని హెచ్చరించడం ఉత్కంఠ రేపుతోంది. ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం అభిమానులను ఆకట్టుకుంటోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.గతేడాది విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన 'జైలర్' చిత్రానికి ఇది సీక్వెల్ కావడం విశేషం. తొలి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 650 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. దీంతో రెండో భాగంపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమ్యకృష్ణ, మిర్నా మీనన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు ఏప్రిల్‌లోనే చిత్రబృందం ప్రకటించింది. తొలి భాగానికి తన సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు సమకూరుస్తున్నారు.





## 'లాకప్ 2'లో రామ్ కపూర్‌కు కంగనా స్ట్రాంగ్ వార్నింగ్!

ప్రముఖ రియాలిటీ షో 'లాకప్: సచ్ యా సజా' సీజన్ 2లో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సందడి చేశారు. 'జనతా కీ ఆవాజ్' ప్రతినిధిగా ఈ షోకు వచ్చిన ఆమె, కంటెస్టెంట్‌గా ఉన్న సీనియర్ నటుడు రామ్ కపూర్ వైఖరిని తప్పుపట్టారు. వ్యక్తిత్వంలో మెరుగుదల కోరుకునే వారు తమను తాము సమర్థించుకోవడం మానుకోవాలని ఆమె హితవు పలికారు.నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమవుతున్న ఈ షోకు ఫరా ఖాన్, రితేశ్ దేశ్‌ముఖ్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు. షో ఐదో ఎపిసోడ్‌లో కంటెస్టెంట్ల ప్రవర్తనను సమీక్షించేందుకు కంగనా రనౌత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నేరుగా రామ్ కపూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఈ ఆటను అస్సలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ జైలు వాతావరణం మీకు సరిపడదని భావిస్తే, అసలు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని నిలదీశారు. దీనికి రామ్ కపూర్ తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయగా.. "మీలో మార్పు రావాలని మీరు నిజంగా కోరుకుంటే, ముందుగా మిమ్మల్ని మీరు సమర్థించుకోవడం ఆపండి" అని కంగనా స్పష్టం చేశారు.ఇదే ఎపిసోడ్‌లో అంతకుముందు హోస్ట్ ఫరా ఖాన్ కూడా రామ్ కపూర్‌కు చురకలంటించారు. సాధారణంగా వివిధ ప్రాజెక్టులలో కథానాయకుడిగా కనిపించే రామ్, ఈ షోలో మాత్రం వెనుకబడిపోతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీనిపై రామ్ కపూర్ తీవ్రంగా స్పందిస్తూ.. "అయితే నన్ను పంపించేయండి.. నేను మారను, నా ప్రవర్తన ఇలాగే ఉంటుంది" అని పేర్కొన్నారు. దీనిపై ఫరా ఖాన్ వ్యంగ్యంగా స్పందిస్తూ.. "పరిస్థితులకు అనుగుణంగా మారని వారు డైనోసార్లలా కనుమరుగైపోతారు" అని వ్యాఖ్యానించారు.మొదటి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన కంగనా, ఈసారి అతిథిగా వచ్చి కంటెస్టెంట్ల ప్రవర్తనపై స్పందించడం ఆసక్తికరంగా మారింది. ఈ ఎపిసోడ్ ప్రసారమైన తర్వాత సోషల్ మీడియాలో దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

## విజయ్ చివరి సినిమా రిలీజ్‌కు గ్రీన్ సిగ్నల్?.. జులైలోనే 'జన నాయగన్'!

జులైలో 'జన నాయగన్' విడుదలయ్యే అవకాశం

సెన్సార్ క్లియరెన్స్ ఆలస్యం వల్లే విడుదల వాయిదా

ఈ నెలలో సెన్సార్ సర్టిఫికెట్ వచ్చే అవకాశం ఉందని సమాచారం

విడుదల తేదీపై ఇంకా అధికారిక ప్రకటన లేదు

విజయ్ నటుడిగా చేసిన చివరి సినిమా ఇదే

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటుడిగా చేసిన చివరి చిత్రం 'జన నాయగన్' ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాను జులైలో విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విడుదల తేదీపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.ఈ సినిమా వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సి ఉంది. కానీ సెన్సార్ బోర్డు క్లియరెన్స్ జాప్యం కావడంతో వాయిదా పడింది. గతేడాది డిసెంబర్‌లో సెన్సార్‌కు పంపిన చిత్రాన్ని రివైజింగ్ కమిటీకి పంపారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ త్వరలో పూర్తయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విజయ్‌తో పాటు బాబీ డియోల్, పూజా హెగ్డే, మమితా బైజు, ప్రకాశ్‌రాజ్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలు పోషించారు. పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు విజయ్ నటించిన చివరి సినిమా కావడంతో 'జన నాయకన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com